మానవ వికాసమే సైన్స్

- ఇన్‌స్పైర్ మనక్ సైన్స్ ప్రదర్శనల్లో విద్యార్థుల ప్రతిభ
- ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ విద్య
- సైన్స్ ప్రచారంలో కృషి చేస్తున్న అనేక సంస్థలు
- ఫిబ్రవరి 28న జాతీయ సైన్స్ దినోత్సవం



కపిలేశ్వరపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో సైన్స్‌ఫేర్‌లో ప్రాజెక్టులను ప్రదర్శిస్తున్న విద్యార్థులు (ఫైల్)

కపిలేశ్వరపురం: విజ్ఞానమే మానవ ప్రగతికి ఆధారమన్నది చారిత్రక సత్యం. విజ్ఞానం వికసించిన మానవ సమూహం ప్రపంచాన్ని వాస్తవిక కోణంలో అద్భుతంగా చూడగలుగుతుంది. ప్రకృతిలోని చలన సూత్రాలను తన జీవన గమనానికి అన్వయించుకుంటుంది. విజ్ఞానాన్ని వ్యాపారమయమైందన్న ప్రస్తుత రోజుల్లో, అందుకు భిన్నంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో సైన్స్ విజ్ఞాన పరికరాలను సమకూర్చి, శాస్త్రీయ ఆలోచనల వృద్ధికి బాట వేస్తోంది. ఏటా నిర్వహించే ఇన్‌స్పైర్ మనక్ సైన్స్ ప్రదర్శనల్లో మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల విద్యార్థులు విశేష ప్రతిభ కనబరుస్తున్నారు. ఫిబ్రవరి 28న జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా ఈ కథనం.

జాతీయ సైన్స్ దినోత్సవం నేపథ్యమిదీ..

నోబెల్ పురస్కార గ్రహీత, భౌతిక శాస్త్రవేత్త చంద్రశేఖర వెంకట్రామన్ (సీవీ రామన్) కాంతిపై 'రామన్ ఎఫెక్ట్' కనుగొన్న రోజైన 1928 ఫిబ్రవరి 28 నాడు జాతీయ సైన్స్ దినోత్సవంగా జరుపుతున్నారు. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థుల్లో ప్రశ్నించే తత్వాన్ని కలిగించాలన్నది జాతీయ సైన్స్ దినోత్సవ కార్యక్రమ ప్రధాన ఉద్దేశం.

జాతీయ స్థాయి ఇన్‌స్పైర్ మనక్ నేపథ్యమిదీ..

కేంద్ర ప్రభుత్వం ఏటా క్షేత్ర స్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు ఇన్‌స్పైర్ పథకాన్ని అమలు చేస్తోంది. 2010లో ప్రవేశపెట్టిన ఈ పథకాన్ని 2012-13 విద్యా సంవత్సరం నుంచి ఇన్‌స్పైర్ మనక్ (మిలియన్ మైండ్స్ అగ్‌మెంటింగ్ నేషనల్ యాస్పిరేషన్ అండ్ నాలెడ్జ్)గా అమలు చేస్తున్నారు. పరిశోధనలపై ఆసక్తి పెంచేందుకు విద్యార్థులకు స్వయంగా సైన్స్ ప్రాజెక్టుల ప్రదర్శన చేసుకునేందుకు ఉపకార వేతనాలను ఇస్తోంది. ఈ నెల 17న జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ మనక్ సైన్స్ ప్రదర్శనలో కపిలేశ్వరపురం మండలం మాచర జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థుల పలు ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

రెండు నియోజకవర్గాల్లో..

మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల్లో జన విజ్ఞాన వేదిక సైన్స్ ప్రచార కార్యక్రమాలను విస్తృతంగా చేపడుతోంది. పాఠశాల, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో చెకుముకి సంబరాలను నిర్వహించి, ప్రతిభ కనబర్చిన వారికి శాస్త్రవేత్తల ద్వారా విజ్ఞాన పాఠాలను చెప్పిస్తోంది. రామచంద్రపురం కేంద్రంగా రేవతి సైన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రయోగాత్మక కార్యక్రమాలను చేపడుతోంది. ప్రజల్లో మూఢ విశ్వాసాలను తొలగించడం, పాఠశాల స్థాయి విద్యార్థుల్లో సైన్స్ బీజాలు నాటడం లక్ష్యంగా తమ సంస్థ పనిచేస్తున్నట్టు ఫౌండేషన్ అధ్యక్షులు కె.కృష్ణసాయి తెలిపారు.

ఆటోమేటిక్ థెఫ్ట్ డిటెక్టర్‌కు మంచి గుర్తింపు



ఈ ఏడాది ఇన్‌స్పైర్ మనక్‌లో భాగంగా అమలాపురంలో నిర్వహించిన జిల్లా స్థాయి సైన్స్ ఫేర్‌లో నా ప్రదర్శనకు మంచి గుర్తింపు దక్కింది. ఏటీఎంలో దొంగతనం చేసేవారిని పట్టుకునేందుకు ఉద్దేశించిన ఆటోమేటిక్ థెఫ్ట్ డిటెక్టర్ పరికరాన్ని తయారు చేశాను. ఆసక్తిగా విన్నారు.

– కుంచే రేణుక, 9వ తరగతి విద్యార్థిని, మాచర హైస్కూల్

ప్రభుత్వ ప్రోత్సాహం బాగుంది



సైన్స్‌కు సంబంధించిన అంశాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో ప్రోత్సాహం బాగుంది. సైన్స్ ఫేర్ నిర్వహిస్తున్న సమయంలో ఉపాధ్యాయులు ప్రోత్సహించారు. దీంతో నేను ఆటోమేటిక్ రైల్వే గేటింగ్ పరికరాన్ని తయారు చేయగలిగాను. పరికరం తయారీ సృజనాత్మకంగా ఉందని ప్రదర్శనను చూసినవారు ప్రశంసించారు.

– వింటి సత్యపావని, పదో తరగతి విద్యార్థిని, మాచర హైస్కూల్

మల్టిపుల్ బ్యాంకింగ్ కార్డు తయారు చేశా



ఒక్కొక్క వ్యక్తికి తమ అవసరాల కోసం పలు బ్యాంకుల్లో ఖాతాలను పొంది ఉంటారు. ఆయా బ్యాంకుల ద్వారా ఏటీఎం కార్డులను సైతం తీసుకుంటారు. ఒక్కో బ్యాంకు ఖాతా నుంచి ఒక్కో కార్డు వాడే అవస్థను పోగొట్టాలన్న ఆలోచన నాకు వచ్చింది. దీంతో స్మార్ట్ కార్డు రీడర్ పరికరాన్ని తయారు చేశాను. ఖాతాదారుడు ఈ కార్డుతో తన ఏ ఖాతానుంచైనా నగదు డ్రా చేసుకునే వీలు కలుగుతుంది.

– నందరావు గ్రీష్మ, పదో తరగతి విద్యార్థిని, మాచర హైస్కూల్

మూఢ విశ్వాసాలు దూరం



సమాజం అభివృద్ధి పథాన నడవాలంటే సైన్స్ ప్రచారం ఏకైక మార్గం. సైన్స్ సంగతులను వివరించడం ద్వారా పెరిగే విజ్ఞానం వల్ల ప్రజల్లో ఉన్న మూఢ విశ్వాసాలు తొలగిపోతాయి. ఆ దిశగా జిల్లాలో ప్రచారం చేస్తున్నాం.

– శ్రీకృష్ణసాయి, అధ్యక్షుడు, రేవతి ఫౌండేషన్, రామచంద్రపురం

క్లుప్తంగా

బెంచ్ ప్రెస్, పవర్ లిఫ్టింగ్‌లలో పతకాలు



గోల్డ్ మెడల్స్, జ్ఞాపికలను అందుకుంటున్న డీఆర్‌కే నాగేశ్వరరావు

రామచంద్రపురం రూరల్: అమలాపురంలో ఆదివారం నిర్వహించిన ఫస్ట్ యునైటెడ్ ఈస్ట్ అండ్ వెస్ట్ పవర్ లిఫ్టింగ్ అండ్ బెంచ్ ప్రెస్ పోటీల్లో ద్రాక్షారామకు చెందిన డీఆర్‌కే నాగేశ్వరరావు బెంచ్ ప్రెస్‌లో గోల్డ్ మెడల్, పవర్ లిఫ్టింగ్‌లో గోల్డ్ మెడల్ సాధించారు. ఈ సందర్భంగా డీఆర్‌కేను ద్రాక్షారామ, అన్నాయిపేట గ్రామాల సర్పంచులు కొత్లపల్లి అరుణ, పెమ్మిరెడ్డి దొరబాబు, వైస్ ఎంపీపీలు శాకా బాబీ, నరాల రాజ్యలక్ష్మి, ఎంపీటీసీ నున్న సత్యవతి, ద్రాక్షారామ ఉప సర్పంచ్ పెన్నాడు బుచ్చిరాజు, వీరభద్రా జిమ్ సహచరులు పొట్టిపోతుల రామకృష్ణ, ఎన్‌టీఎస్, గంధం వీరభద్రరావు తదితరులు అభినందించారు.

చింతా వేదమూర్తికి సత్కారం



వెలంపాలెంలో చింతా వేదమూర్తికి సువర్ణ కంకణంతో సత్కరిస్తున్న పెద్దలు

రామచంద్రపురం రూరల్: వెలంపాలెంలో చంద్రశేఖరేంద్ర సరస్వతి, చంద్రశేఖర భారతీ స్వామి వేద పాఠశాలలో నిర్వహిస్తున్న శుభకరి జ్యోతిష పాఠశాల అధ్యాపకుడు చింతా వేదమూర్తిని ఆదివారం సువర్ణ ఘంటా కంకణంతో ఘనంగా సన్మానించారు. 15 ఏళ్లుగా అమెరికాలోని శ్రీవిజయ గంగా ఆధ్యాత్మిక సేవా సంస్థకు జ్యోతిష సేవలు అందిస్తున్న సందర్భంగా ఆ సంస్థ ఆయనకు సుమారు రూ.2 లక్షల విలువైన సువర్ణ కంకణాన్ని బహూకరించింది. ఈ సందర్భంగా వేదమూర్తి మాట్లాడుతూ తన తండ్రి చింతా యాజ్ఞవల్క మహర్షి మాట మేరకు తాను జ్యోతిష శాస్త్రాన్ని ఉచితంగానే బోధిస్తున్నట్లు, ఈ కంకణాన్ని ఆయనకు అంకితం ఇస్తున్నట్లు పేర్కొన్నారు. జ్యోతిష పాఠశాల గురువు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత రేగడమిల్లి సత్యమూర్తి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో చింతా శ్రీరామచంద్రమూర్తి, అమ్మావజ్జల వెంకట సీతారామయ్య, జయంతి కృష్ణమూర్తి, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా సత్తెమ్మతల్లి జాతర



గొల్లపాలెంలో అన్న ప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

కాజులూరు: గొల్లపాలెం శివారు గుండారం కాలనీలో సత్తెమ్మ తల్లి తీర్థ మహోత్సవాలు జరిగాయి. శనివారం రాత్రి నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకూ గ్రామంలో గరగ నృత్యాలతో జాతర నిర్వహించారు. తర్వాత ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పరిసర గ్రామాల నుంచి వేలాదిగా భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు కమిటీ సభ్యులు తాగు నీరు, అల్పాహార ఏర్పాట్లు చేశారు. మధ్యాహ్నం పలువురి దాతల సహకారంతో ఆలయం వద్ద అన్నసమారాధన జరిగింది.

బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడికి సత్కారం

రామచంద్రపురం: పట్టణానికి చెందిన బీజేపీ నాయకుడు యాండ్ర బుల్లబ్బులు ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు యాళ్ల దొరబాబు ఈ మేరకు ఉత్తర్వులు ఇచ్చారని ఆదివారం బుల్లబ్బాయి విలేకరులకు తెలిపారు. ఆయనకు అనకాపల్లి నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి కర్రి చిట్టిబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఇళ్ల వెంకటేశ్వరరావు, ట్రేడర్స్ సెల్ కన్వీనర్ కొట్టువాడ హరిబాబు, ఖండవిల్లి సత్యనారాయణ తదితరులు అభినందనలు తెలిపారు.

కిటకిటలాడిన అప్పనపల్లి

మామిడికుదురు: అప్పనపల్లి శ్రీబాల బాలాజీ స్వామి ఆలయం మాఘ మాసం ఆదివారం సందర్భంగా భక్తులతో కోలాహలంగా మారింది. వైనతేయ గోదావరి నదీలో అధిక సంఖ్యలో భక్తులు పుణ్య స్నానాలు ఆచరించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేతంగా కొలువైన బాల బాలాజీ స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం లక్ష్మీనారాయణ హోమం కన్నుల పండువగా జరిగింది.

అంతర్వేది..

సఖినేటిపల్లి: అంతర్వేది క్షేత్రం ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. స్థానిక చెరువులో నిర్వహించిన స్వామి, అమ్మవార్ల తెప్పోత్సవాన్ని వీక్షించేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఈ నెల 16 నుంచి 25వ తేదీ వరకూ పది రోజులపాటు నిర్వహించిన స్వామివారి కల్యాణోత్సవాలు భక్తులను భక్తిపారవశ్యంతో ఓలలాడించాయి. ఉత్సవాల్లో చివరిరోజు సాయంత్రం 5 గంటలకు పుష్పక వాహనంపై స్వామివారి గ్రామోత్సవాన్ని నిర్వహించారు.

అవగాహనతో ఆక్వా సాగులో దిగుబడులు



గొల్లపాలెంలో చెరువును పరిశీలిస్తున్న ఫిషరీస్ ఎడ్యుకేషన్ సైంటిస్టులు, విద్యార్థులు

కాజులూరు: అవగాహనతోనే ఆక్వా సాగులో రైతులు అధిక దిగుబడులు సాధించవచ్చని కాకినాడ సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ ఎడ్యుకేషన్ ఇన్‌చార్జి మురళీమోహన్ పి.అందే అన్నారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు చెందిన రైతులు, విద్యార్థులు కొన్ని రోజులుగా కాకినాడ సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ ఎడ్యుకేషన్‌లో రొయ్యలు, చేపల సాగుపై శిక్షణ పొందుతున్నారు. వీరంతా క్షేత్రస్థాయిలో చెరువుల పరిశీలన నిమిత్తం ఆదివారం గొల్లపాలెం వచ్చారు. ఈ గ్రామంలో జాతీయ ఉత్తమ ఆక్వా రైతుగా అవార్డు పొందిన టి.వీరవెంకటరెడ్డి (వాసురెడ్డి)కి చెందిన రొయ్యల చెరువులను పరిశీలించారు. ఈ సందర్భంగా మురళీమోహన్ పి.అందే మాట్లాడుతూ కోస్తా తీరంలో ఆక్వా సాగు రోజురోజుకూ విస్తరిస్తుందన్నారు. అయితే టెక్నీషియన్ల కొరతతో రైతులకు సరైన సూచనలు, సలహాలు అందక తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకున్న కేంద్ర మత్స్యశాఖ కాకినాడలో సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ ఎడ్యుకేషన్‌లో ఇటీవల టెక్నీషియన్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించడంతో పాటు ఇతర ప్రభుత్వ కళాశాలలకు చెందిన విద్యార్థులకు, రైతులకు వృత్తిపరమైన శిక్షణ ఇస్తుందన్నారు. ఆక్వా సైంటిస్ట్ డాక్టర్ శ్రీనివాస్, సూపర్‌వైజర్ కేజీఎస్‌ఆర్ ఆంజనేయులు, సిబ్బంది వాసంశెట్టి కొండయ్య, కొప్పుల ధర్మయ్య, పెంటపాటి రాజేష్ పాల్గొన్నారు.

సీఎం జగన్‌తో సామాజిక న్యాయం



రత్నంపేటలో పథకాల బుక్‌లెట్ అందిస్తున్న వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ సూర్యప్రకాశ్ తదితరులు

- వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ సూర్యప్రకాశ్
- రామచంద్రపురంలో గడప గడపకూ..

రామచంద్రపురం: పథకాల అమలుతో పాటు రాజకీయ పదవుల్లోనూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సామాజిక న్యాయాన్ని పాటించారని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్ అన్నారు. పట్టణంలోని 21వ వార్డు రత్నంపేటలో ఆదివారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ప్రతి ఇంటికి వెళ్లి ఐదేళ్ల వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో ఆయా కుటుంబాలకు జరిగిన లబ్ధిని వివరిస్తూ బ్రోచర్లు అందజేశారు. ఆయా కాలనీల్లో ప్రజల సమస్యలు తెలుసుకుని, వాటిని పరిష్కరించాలని అధికారులకు తెలిపారు. ఈ సందర్భంగా సూర్యప్రకాశ్ మాట్లాడుతూ ఇటీవల భీమిలి, ఏలూరు, రాప్తాడులలో సిద్ధం సభల ద్వారా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజల్లో ఉన్న ఆదరణ తెలుస్తుందన్నారు. ప్రతి కుటుంబానికీ ప్రభుత్వ పథకాల లబ్ధి చేకూరిందన్నారు. రాష్ట్రంలో పేదరికం తగ్గిందని గణాంకాలు చెబుతున్నా, ప్రతిపక్షాలు మాత్రం విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి కొనసాగాలంటే తిరిగి జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు వైఎస్సార్ సీపీకి మద్దతుగా నిలవాలని కోరారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గాధంశెట్టి శ్రీదేవి, వైస్ చైర్మన్ కోలమూరి శివాజీ, కౌన్సిలర్లు కేతా సుజాత, బాసిన నాగమణి, నల్లా అంజమ్మ, కో ఆప్షన్ సభ్యుడు మస్తాన్, ది అర్బన్ కో ఆపరేటివ్ బ్యాంకు డైరెక్టర్ మల్లిడి సాయిలక్ష్మి, పార్టీ పట్టణ కన్వీనర్ గాధంశెట్టి శ్రీధర్, పార్టీ నేతలు పోతంశెట్టి గోపాలకృష్ణ, బావాల భద్రరావు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ ప్రభుత్వ లబ్ధి

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- కోరుమిల్లిలో గడప గడపకూ..



కోరుమిల్లిలో ప్రజల అర్జీని పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

కపిలేశ్వరపురం: ప్రతి పేద, మధ్య తరగతి కుటుంబాలకు ప్రభుత్వ లబ్ధిని చేకూర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. మండలంలోని కోరుమిల్లిలో ఆదివారం గడప గపడకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా రెండో రోజు పర్యటించారు. జెడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, యువనేత తోట పృథ్వీరాజ్, మండపేట మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి, కౌన్సిలర్లులకు ప్రజలు ఘన స్వాగతం పలికారు. మహిళలు హారతి పట్టారు. అభిమానులు పూలవర్షం కురిపిస్తూ వీధుల్లో ఎమ్మెల్సీ తోట వెంట నడిచారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం నుంచి అందిన లబ్ధి వివరాలను ఎమ్మెల్సీ తోట వలంటీర్ ద్వారా వెల్లడించారు. ఇంకా ఏమైనా సమస్యలున్నాయా అంటూ గ్రామస్తులను అడిగారు. ప్రజలు ప్రస్తావించిన సమస్యలను ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డితో చర్చించి, పరిష్కరించాలని ఆదేశించారు. గ్రామంలో ఓ చిన్నారి తమ బడి గతంకంటే బాగుందని, పాఠాలు బాగా చెబుతున్నారని, బడి అందంగా తయారైందని చెబుతూ సంతోషాన్ని వ్యక్తం చేసింది. డ్వాక్రా మహిళలు తమ రుణాలను నాలుగు విడతల్లో మాఫీ చేస్తానంటూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాటను, నాలుగో విడత సొమ్ము విడుదలతో నిజం చేశారంటూ ఆనందాన్ని వ్యక్తం చేశారు. గ్రామానికి ఏ సమస్య వచ్చినా పెద్ద దిక్కుగా నిలబడుతున్న ఎమ్మెల్సీకి గ్రామ పెద్దలు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ రాజకీయాలకతీతంగా పేదరికమే అర్హతగా ప్రభుత్వం సంక్షేమాన్ని అందిస్తోందన్నారు. గ్రామంలోని సమస్యలను ప్రాధాన్య క్రమంలో పరిష్కరిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మండల సాగు సలహా మండలి చైర్మన్ పుట్టా కృష్ణమూర్తి, పీఏసీఎస్ చైర్మన్ ఆచంట వీవీ స్వామి, మాజీ సర్పంచ్ సలాది వీరబాబు, మాజీ డీసీసీబీ డైరెక్టర్ సలాది అప్పారావు, పేరాబత్తుల రామకృష్ణ, సుంకర మూలాస్వామి, పేరాబత్తుల శివశంకర్, వింటి సత్తిబాబు,సుంకర చిన్న, పాలింగి శ్రీనివాస్, యరమాటి వెంకన్నబాబు, కౌన్సిలర్ ఎం.బాపిరాజు పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాల ఓటర్లకు వీల్ చైర్లు



వీల్ చైర్లను ఆర్డీఓ, కమిషనర్‌లకు అందించిన జీవీ రావు

రామచంద్రపురం: విద్యావేత్త డాక్టర్ గరిగిపాటి రుద్రయ్య చౌదరి వర్ధంతిని పురస్కరించుకుని మోడరన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎన్నికల సమయంలో సీనియర్ సిటిజన్లు, ప్రత్యేక అవసరాలు గల ఓటర్ల సౌకర్యార్థం వీల్ చైర్లను మోడరన్ విద్యాసంస్థల అధినేత జీవీరావు ఆదివారం అందజేశారు. వీటిని స్థానిక మోడరన్ కళాశాల ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో ఆర్డీఓ ఎస్.సుధాసాగర్, మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాసులకు ఇచ్చారు. ఈ సందర్భంగా రావు మాట్లాడుతూ సామాజిక సేవా రంగాల్లో మోడరన్ ఫౌండేషన్ చేస్తున్న కృషికి రుద్రయ్య చౌదరి భావజాలమే స్ఫూర్తి అని అన్నారు. ఆర్డీఓ సుధాసాగర్ మాట్లాడుతూ ఓటర్లకు ఉపయోగపడేలా వీల్ చైర్స్‌ను జీవీ రావు అందజేయడం అభినందనీయమన్నారు. మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు మాట్లాడుతూ పరిపూర్ణమైన ఆశయంతో చేసే సేవ పదిమందికి ఆసరాగా ఉంటుందన్నారు.

వైఎస్సార్ సీపీలోకి జనసేన శ్రేణులు



పార్టీ కండువాలు కప్పి, ఆహ్వానిస్తున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

కపిలేశ్వరపురం: కోరుమిల్లి గ్రామంలో జనసేనకు కీలకమైన 30 మంది నాయకులు, కార్యకర్తలు పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేసి ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. నియోజకవర్గంలో ఎమ్మెల్సీ తోట చేపడుతున్న అభివృద్ధి పనులు, సమస్యలపై స్పందిస్తున్న తీరుకు తాము ఆకర్షితులమయ్యామని వారు పేర్కొన్నారు. దీర్ఘకాలంగా జనసేనలో పనిచేశామని, పొత్తు పేరుతో తాము ఆశించిన స్థానాల్లో పోటీ చేసే అవకాశాన్ని జారవిడుచుకోవడం ఆవేదనకు గురి చేసిందన్నారు. తమ గ్రామాభివృద్ధి కోసం ఎమ్మెల్సీ తోట వెంట నడుస్తామన్నారు. వారికి ఎమ్మెల్సీ తోట, ఆయన తనయుడు, యువనేత పృథ్వీరాజ్ వైఎస్సార్ సీపీ కండువాలను కప్పి సాదరంగా ఆహ్వానించారు. చేరినవారిలో వింటి సతీష్‌నాయుడు, సుంకర మురళి, సుంకర సత్తిబాబు, వింటి శివ, తుట్టుపు కృష్ణమూర్తి, వింటి సతీష్, రాయుడు సింహాద్రి, వింటి విష్ణు, అథపా వాసు, సుంకర ప్రసాద్‌లు ఉన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు ఆచంట వీవీ స్వామి, నాయకులు సలాది వీరబాబు, పేరాబత్తుల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మృతదేహం మార్చురీకి తరలింపు

అమలాపురం టౌన్: అమలాపురం శ్రీలలితా థియేటర్ ఎదురుగా ఉన్న సందులో వ్యక్తి(58) మృతి చెందినట్లు స్థానికులు ఆదివారం గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఆధార్ కార్డు ఆధారంగా అయినాపురానికి చెందిన దోనిపాటి సత్యనారాయణగా పోలీసులు గుర్తించారు. మృతుడి బంధువులకు సమాచారం అందించారు. బంధులెవరూ రాకపోవడంతో మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలోని మార్చురీకి తరలించినట్లు పట్టణ సీఐ క్రిస్టోఫర్ తెలిపారు.


బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయాన్ని అందజేస్తున్న రవికుమార్ సోదరులు

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట పట్టణంలోని అరుంధతీపేటలో తీవ్ర అనారోగ్యంతో రెండు నెలల క్రితం మరణించిన గృహసారథి పలివెల కుమార్ కుటుంబ సభ్యులకు ఎనిమిదో వార్డు కౌన్సిలర్ మందపల్లి రవికుమార్, ఆయన సోదరులు సుధాకర్, సంజీవరావులు రూ.6 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. కుమార్ కుటుంబానికి ప్రభుత్వం తరపున రూ.లక్ష వైఎస్సార్ బీమా అందజేశార ని, కుటుంబ పరిస్థితుల రీత్యా తాము వ్యక్తిగతంగా ఆర్థిక సాయం అందించినట్టు మందపల్లి సోదరులు తెలిపారు.

ఏఆర్ కానిస్టేబుల్‌కు సత్కారం



ఏఆర్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు సత్కరిస్తున్న పెద్దలు

పి.గన్నవరం: ఇటీవల ప్రమాదంలో చిక్కుకున్న ఏడుగురు ప్రయాణికులను రక్షించిన రాజమహేంద్రవరం ఏఆర్ కానిస్టేబుల్ నెల్లి శ్రీనివాసరావును ఆదివారం పి.గన్నవరంలో మమత స్వచ్ఛంద సేవాసమితి అధ్యక్షుడు కోరుకొండ జాన్ ఆధ్వర్యంలో సత్కరించారు. బెల్లంపూడి వద్ద ఇటీవల కారు అదుపుతప్పి పంట కాలువలోకి దూసుకుపోయిన సంఘటనలో.. కారులో ఉన్న ఏడుగురిని కానిస్టేబుల్ రక్షించిన విషయం విదితమే. శ్రీనివాసరావుకు మెమెంటో అందజేసి అభినందించారు. ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, ఎస్సై బి.శివకృష్ణ, సర్పంచ్ బొండాడ నాగమణి, నాయకులు నల్లా పెదకాపు, రావూరి సత్యనారాయణ, పుచ్చకాయల సాధు, నేలపూడి రామకృష్ణ పాల్గొన్నారు.

ప్రశాంతంగా గ్రూపు-2 పరీక్ష



పరీక్ష కేంద్రంలోకి వస్తున్న అభ్యర్థులు

రాయవరం: మండల కేంద్రం రాయవరంలో ఆదివారం నిర్వహించిన గ్రూపు-2 పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. స్థానిక శ్రీరామయ్య జెడ్పీ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో మొత్తం 18 గదుల్లో పరీక్ష నిర్వహించారు. పరీక్షా కేంద్రంలో 432 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా, 109 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. 323 మంది అభ్యర్థులు పరీక్ష రాశారు. పరీక్షా కేంద్రానికి చీఫ్ సూపరింటెండెంట్‌గా పాఠశాల హెచ్‌ఎం వీఎస్ సునీత, లైజనింగ్ అధికారిగా మండల వ్యవసాయాధికారి కొప్పిశెట్టి ప్రభాకర్ వ్యవహరించారు. ఉదయం 9 గంటలకే పరీక్షా కేంద్రానికి అభ్యర్థులు చేరుకున్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి అభ్యర్థులను పరీక్షా కేంద్రానికి కేటాయించారు. ఉదయం 9.30 నుంచి అభ్యర్థులను పరీక్షా కేంద్రంలోకి అనుమతించి, 10.15 తర్వాత ఏ ఒక్కరినీ అనుమతించలేదు. పరీక్షా కేంద్రం మండపేట రూరల్ సీఐ కె.శ్రీధర్‌కుమార్, ఎస్సై జి.నరేష్, ఏఎస్సై పి.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

సర్పంచుల ఆత్మీయ కలయిక



ఆత్మీయ కలయికలో సూర్యప్రకాష్‌ను సన్మానిస్తున్న సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు

కె.గంగవరం: కోలంక గ్రామంలో మండలంలోని పలు గ్రామాలకు చెందిన సర్పంచుల ఆత్మీయ కలయిన ఆదివారం జరిగింది. సర్పంచులుగా ఎన్నికై మూడేళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన వైఎస్సార్ సీపీ రామచంద్రపురం కో ఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాష్‌ను సర్పంచులు సత్కరించారు. అనంతరం కేక్ కట్ చేసి సహపంక్తి భోజనాలు చేశారు. పలువురు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి తమ వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. నియోజకవర్గ సమన్వయకర్త చింతలపాటి శ్రీనువాసురాజు, మార్కెట్ కమిటీ చైర్మన్ పండు గోవిందరాజు, డీసీఎంఎస్ డైరెక్టర్ పెట్టా శ్రీనివాస్, యువజన నాయకులు జత్తుక శ్యాంప్రసాద్, బీసీ నాయకుడు పంపన సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

28న ఉద్యోగ మేళా

కొత్తపేట: రాజమహేంద్రవరంలో 28న మెగా ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వాణి తెలిపారు. ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్ విభాగం ఆధ్వర్యంలో ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాలు జోన్-2 రీజినల్ జాబ్ మేళా రాజమహేంద్రవరం వీఎల్ పురం మార్గాని ఎస్టేట్స్ వద్ద జరుగుతుందన్నారు. ఈ మేళాకు 121 కంపెనీలు వస్తుండగా, ఆయా కంపెనీల్లో 18 నుంచి 35 ఏళ్ల వయసు వరకూ టెన్త్ నుంచి గ్రాడ్యుయేషన్ విద్యార్హత కలిగిన అభ్యర్థులు అర్హులు.